క్లుప్తంగా

వి.రెడ్డిపాలెంలో పశువైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో సోమవారం మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 39 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 45 లేగదూడలకు నట్టల నివారణ మందులు, 11 పశువులకు కృత్రిమ గర్భధారణ, 4 పశువులకు శస్త్ర చికిత్సలు, మరో 38 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి ప్రారంభించగా, పశువైద్యులు డాక్టర్ కేవి శ్రీకాంత్‌రెడ్డి, వీఎల్‌వో ఎం.ఏ శ్రీహరి, వీఏవీడీలు డి. వేమారెడ్డి, షేక్ మస్తాన్‌వలి, పవన్ గోపి, గోపాల్ మిత్ర కె. వెంకట్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. డీడీ రామారావు, డీఏహెచ్‌వో వెంకటేశ్వరనాయక్‌లు పర్యవేక్షించారు. వి. అంజిరెడ్డి, వి. ఓబుల్‌రెడ్డి, ఎం. అశోక్‌రెడ్డి తదితరులు సహాయ సహకారాలు అందించారు.

12 మంది టీచర్లు, ఐదుగురు ఆయాలు డిస్మిస్

ఈపూరు: స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 12 మంది టీచర్లను, ఐదుగురు ఆయాలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు సీడీపీవో అరుణ సోమవారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో 130 మంది టీచర్లు, 128 మంది ఆయాలు ఉండగా వీరిలో 12 మంది టీచర్లు, ఐదుగురు ఆయాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వీసు నుంచి తొలగించినట్లు తెలిపారు. మిగతా ముగ్గురు ఆయాలు సెలవులో ఉండటంతో ఇది వర్తించదన్నారు. త్వరలో విడుదల చేసే నోటిఫికేషన్ ద్వారా నూతన ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఈనాం భూముల సర్వే పూర్తి

బొల్లాపల్లి : అగ్రహార భూముల సర్వే పూర్తయిందని, అర్హత గల ప్రతిరైతుకు రైతువారీ పట్టాలు త్వరలో జారీ చేస్తామని తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు తెలిపారు. మండలంలోని గుమ్మనంపాడు ఈనాం భూములకు సంబంధించి రైతులు, అగ్రహారీకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఈనాం భూముల సర్వే పూర్తి చేశామని తెలిపారు. ఈనాం భూముల చట్టం పరిధిలో త్వరలో రైతులకు రైతువారీ పట్టాలు జారీ చేస్తామన్నారు. అగ్రహారీకుల సమ్మతితో వారిలో ఒకరిని ఎంపిక అనంతరం ఈ పట్టాలు పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ వి.సుధాకర్‌శర్మ, వీఆర్వోలు, సర్వేలు, రైతులు, అగ్రహారికులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితురాలి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్ర బాబు సోమవారం తెలిపారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 18 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న దమయంతిని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంగస్థలి నూతన కార్యవర్గ ఎన్నిక

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేషన్‌రోడ్డులోని విజయ్ రెసిడెన్సీలో ఆదివారం రాత్రి నిర్వహించిన రంగస్థలి సమావేశంలో నూతన అధ్యక్షునిగా షేక్.మహబూబ్ సుభాని, ప్రధాన కార్యదర్శిగా నల్లపాటి విజయ రామచంద్రబోస్, కోశాధికారిగా కనపర్తి సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎం.డి.ఎస్.పాషా వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనుంది. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఎంపిక చేసి తదుపరి నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంలో ప్రకటించనున్నట్టు అధ్యక్షుడు మహబూబ్‌సుభాని తెలిపారు.

నేడు ఎండుగుంపాలెంలో జగనన్న సురక్ష క్యాంపు

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ క్యాంపు కొనసాగుతుందన్నారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటూ స్పెషలిస్ట్ వైద్యులు హాజరౌతారన్నారు. గ్రామస్తులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డాక్టర్ తన్నీరుకు గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు



చిలకలూరిపేట: ఏపీ వడియరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎంపిక సమావేశం గుంటూరులోని అరండల్‌పేటలో ఉన్న దేశీయ విశ్వకర్మ బ్రాహ్మణ సమాజంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో చిలకలూరిపేటలోని పురుషోత్తమపట్నం అడ్డరోడ్డులో ఉన్న పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ తన్నీరు శ్రీనివాస రావును సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆయన ఎంపిక పట్ల పలువురు వడియరాజ్ ఉద్యోగ సంఘ నాయకులు, పట్టణ ప్రముఖులు, పశువైద్య శాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



వినుకొండలో గుంటి ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు ..



నరసరావుపేట పట్టాభిరామస్వామి ఆలయంలో...



నరసరావుపేటలో శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే



చిలకలూరిపేటలో జరిగిన యాత్రలో సమన్వయకర్త మల్లెల

శ్రీరామరక్ష - సర్వజగద్రక్ష

- వైభవంగా అయోధ్యరాముడికి పూజలు
- ప్రత్యక్షప్రసారాలు చూసి ఆనందించిన భక్తజనం
- నరసరావుపేటలో ఆధ్యాత్మిక ర్యాలీ
- ఆలయాల్లో భక్తులు కిటకిట



నరసరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: అంతా రామమయం.... పట్టణమంతా శ్రీరామమయమే.. అయోధ్యలో శ్రీరామ మందిరంలో బాలరాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. ప్రధాన వీధులు కాషాయ రంగు జెండాలతో రెపరెపలాడాయి. జైశ్రీరామ్ నినాదాలు, శ్రీరా ముని భక్తి గీతాలతో వీధులు మారుమ్రోగాయి. వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు జైశ్రీరామ్ నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. పట్టాభిరామస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. అలాగే శ్రీసీతారామస్వామి ఆలయం, శ్రీ సీతారామచంద్ర అలయం, వివిధ అంజనేయస్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు.

అంతటా అయోధ్య సందడి!

నరసరావుపేట: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రారంభం, బాలరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పండగ ఏ ఒక్కరిదో కాదని, అందరిదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పట్టణంలోని కాకుమాను బజారు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శోభాయాత్రకు ముఖ్యఅతిథి గా హాజరై మాట్లాడారు. మహిళలతో కలిసి కోలాటం నృత్యం చేశారు. శ్రీ సీతారామస్వామి దేవాలయం, పడమట బజారులోని రామాలయం గుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పట్టాభిరామస్వామి దేవాలయంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో సింధు స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ లైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా శివుడు బొమ్మ, పల్నాడు బస్టాండ్‌లోని రెడ్డి కాలేజ్ వద్ద అన్నదానం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీలతో కలిసి ప్రారంభించారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, ఆర్యవైశ్య నాయకులు ఊర భాస్కరరావు, ప్రవల్లిగా సత్యం, పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడు కొత్తూరి కోటేశ్వరరావు, సింధూస్కూలు రామకృష్ణ, పెద్ద ఎత్తున మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

రెడ్డినగర్‌లో గ్రామోత్సవం

నరసరావుపేట రూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డినగర్‌లో సీతా సమేత శ్రీరాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుని ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష తులసి ఆకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని శ్రీరాముని విగ్రహానికి కొబ్బరికాయలతో అలంకరణ చేసి లక్షాదీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాముని వేషధారణలు అలరించాయి. అనంతరం 2 వేల మంది అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెండేల పుల్లారావు, కొత్తమాసు శివ, చుండూరి శ్రీమన్నారాయణ, సుబ్బారావు, సురేష్, రెడ్డి వెంకటరత్నం, పులిపాటి రామారావు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని రామాలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వనికుంట, అంగలూరు, ఈపూరుతో పాటు ఆయా గ్రామాల్లోని భక్తులు దేవాలయాలను అలంకరించి ఉదయం నుంచే ప్రత్యేకపూజలు, రామభజనలు చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: అయోధ్యలో శ్రీరాముడు ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు సందర్భంగా మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 500 వందల సంవత్సరాల నాటి శ్రీరాముని బాలరామ ప్రతిష్ఠ జరగటం దేశానికి శుభాసూచికమని భక్తులు కీర్తించారు. అయోధ్యలో జరుగుతున్న ప్రతిష్ఠ వేడుకలను భక్తులు టీవీల ద్వారా వీక్షించి తమ భక్తిని చాటుకున్నారు. శావల్యాపురంలో వేంచేసియున్న కోదండరామస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు,

నాదెండ్లలో....

నాదెండ్ల: గ్రామాల్లో సోమవారం జై శ్రీరామ నామస్మరణ మార్మోగింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి తోరణాలతో అలంకరించారు. సీతాసమేత రాముడు, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో స్వామివారికి అభిషేకాలు, తులసీ దళార్చన నిర్వహించారు. గణపవరం శ్రీ కోదండరామాలయం, సాతులూరు రామాలయాల్లో పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో సోమవారం అయోధ్యలోని శ్రీబాలరామ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రొంపిచర్ల రామాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: సకల సుగుణ సంపన్నుడు శ్రీరామచంద్రుడు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జరిగిన శ్రీరామనగర సంకీర్తన కార్యక్రమంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆధ్మాత్మిక ఉత్సహంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యు త్ దీపాల నడుమ, జై శ్రీరామ్ నినాదాలతో కార్యక్రమం ఆధ్మాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



గణపవరం కోదండ రామాలయంలో స్వామివారి అలంకారం



సాతులూరులో ద్విచక్రవాహనాలపై ర్యాలీ



శావల్యాపురంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

యడ్లపాడులో రాముల వారి శోభాయాత్ర



యడ్లపాడు: అయోధ్యలోని బృహత్తర రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీరామ్‌నగర్ లోని రామమందిర్‌లో పంచలోహ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముందుగా రాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ, విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర గావించారు. శోభాయాత్ర ఆద్యంతం జై శ్రీరామ్ నామంతో మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపుగా తమ ఇళ్ల ముంగటకు వచ్చిన దేవతామూర్తులకు నీటివారపోసి, కొబ్బరికాయలు కొడుతూ పూజలు భక్తులు చేశారు. దారిపొడవునా ప్రసాద వితరణ జరిగింది. అయోధ్య మందిరం ప్రతిష్ఠ శుభముహూర్త సమయానే విగ్రహాలను ఆలయంలో ఉంచారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని కంచి నుంచి వచ్చిన అంజినానంద తీర్థస్వామి నిర్వహించారు. రామమందిర్ నిర్మాణ కమిటీ అధ్యక్షులు వేగేశ్న అంజిరాజు, కనుమూరి పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మందిరం కమిటీ సభ్యులు పేరేచర్ల పూర్ణచంద్రరాజు, తిరుమలరాజు సుబ్బరాజు, మొగసాటి భీమ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు, రాష్ట్ర కమిటీ నిర్వహణ కమిటీ సభ్యులు పరాంకుశం శ్రీనివాసరావు, పోట్రు పూర్ణచంద్రరావు, మల్లెల శివనాగేశ్వరరావు, సాంబశివరావు, పగిడిమర్రి శివాజీ, ముత్తవరపు సుబ్బారావు, కర్నాటి సుబ్బారావు, కీర్తి అరుణ్‌కుమార్, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కాకుమాను గిరి, హనుమంతరావు, మద్దుల రమణ తదితరులు ఉన్నారు.

రెండురోజులుగా ఆలయాల్లో పూజలు...

అయోధ్య మందిరం ప్రారంభం సందర్భంగా యడ్లపాడులోని రామాలయం, రణవీరాంజనేయ, ప్రపత్తి ఆంజనేయస్వామి, బోయపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట, లింగారావుపాలెం, జాలాది, జగ్గాపురం, ఉన్నవ, దింతెనపాడు, సందెపూడి గ్రామాల్లోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామాలకు సుపరిపాలన చేర్చిన ఘనత జగనన్నదే

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గ్రామసచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రతిగ్రామంలో గ్రామపరిపాలన విధానాన్ని తీసుకొచ్చి సుపరిపాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం కొప్పుకొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించి ప్రతి సంక్షేమాన్ని గడప ముందుకే తీసుకొచ్చి, ఎలాంటి సమస్యలైనా గ్రామంలోనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలైనా మండలంలో ఉన్న మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, నేడు అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమ చేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ వెయ్యి రూపాయలు ఇస్తే, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ హయాంలో రూ.3 వేలు వరకు ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన వారందరికి ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామున వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి మరీ పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమాన్ని, అభి వృద్ధిని ప్రజలు గమనించి ప్రజా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మీ రాజా, గ్రామసర్పంచ్ కోలా వీరాంజనేయులు, మండల కన్వీనర్ దండు చెన్నయ్య పాల్గొన్నారు.

అత్యున్నత సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



రేమిడిచర్ల జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 2వ విడత పంపిణీలో భాగంగా ట్యాబ్‌లు సోమవారం గ్రామసర్పంచ్ వి.బ్రహ్మనాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని, ఆంగ్ల బోధన ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి గ్రామంలోని ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని తెలిపారు. పేద విద్యార్థులు అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విన్సెంట్ ఫిలోమెన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అత్యధిక సాంకేతికను అందిపుచ్చుకునేందుకు పాఠశాల స్థాయి నుంచి విద్యాభివృద్ధి సాధన దిశలో ప్రభుత్వ ట్యాబ్‌ల పంపిణీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు బైజూస్ సాంకేతికత ద్వారా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేవిధంగా ఈ ట్యాబ్‌లు ఉపయోగకరమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతివిద్యార్థి అందిపుచ్చుకొని ఉత్తమ విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. గ్రామపెద్దలు నాగేశ్వరరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా నయనతార

నరసరావుపేట టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ గా బి. నయనతార సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూరులో సీఐగా పనిచేస్తూ బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. 2005లో నరసరావుపేట ఎక్సైజ్ ఎస్ఐగా పనిచేశారు. 2010లో పదోన్నతి పొంది చిలకలూరిపేట సీఐగా ఆమె విధులు నిర్వహించారు. నాటుసారా, అక్రమ మద్యం నివారణకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.


ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతులు

రొంపిచర్ల: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన జట్లకు సోమవారం ఎండీవో కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ విద్యార్థులు ప్రైజ్‌మనీగా రూ.32 వేల రూపాయలను అందజేశారు. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలలో విన్నర్స్, రన్నర్స్‌గా గెలుపొందిన వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు, కొత్తపల్లి, గోగులపాడు, వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల, కొత్తపల్లి, రొంపిచర్ల జట్లకు ప్రథమ బహుమతిగా రూ.3వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, ఎండీవో మాధ్యుబాబు, గ్రామ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, మండల కో-ఆర్డీనేటర్ వై.సైదయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతగా కావూరు జట్టు

చిలకలూరిపేటటౌన్: ఆడుదాం ఆంధ్రలో భాగంగా సోమవారం పట్టణంలోని పురుషోత్తమపట్నంలో క్రీడా ప్రాంగణంలో క్రికెట్ విభాగంలో పోటీలు కొనసాగాయి. బాలుర విభాగంలో సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సెమీ ఫైనల్‌లో మ్యాచ్ గణపవరం జట్టుపై కావూరు జట్టు విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్‌లో పురుషోత్తమపట్నం జట్టు మద్దినగర్ జట్టుపై విజయం సాధించింది. అనంతరం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కావూరు జట్టు పురుషోత్తమపట్నం జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కావూరు జట్టుకు రూ. 20వేల విలువ చేసే క్రికెట్ కిట్‌ను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కె లక్ష్మి అందించారు.

కనపర్రులో కొనసాగిన మెడికల్ క్యాంపు



కనపర్రు పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో విషజ్వరాలు ప్రబలటంతో రెండో రోజు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో పాటూ మెడికల్ క్యాంపులు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. విషయం తెలుసుకున్న చిలకలూరిపేట వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో ఫోన్‌లో సంభాషించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు వంటి కనీస మౌలిక వసతులతో పాటూ ఎప్పటికప్పుడు శానిటేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. కావూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గ్రామాల్లో మురుగునీరు పారుదల సౌకర్యం, నీటి నిల్వలు లేకుండా పారద్రోలటం, దోమలు ప్రబలే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సీతారామయ్య, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సబ్‌యూనిట్ అధికారి నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కాంతారావు తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

- కొప్పుకొండలో 200 కుటుంబాలు చేరిక
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరిక
- ఎమ్మెల్యే బొల్లా సమక్షంలో పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని కొప్పుకొండ గ్రామంలోని టీడీపీకి చెందిన 200 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న వారికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వం ద్వారా అభివృద్ధి చూసి, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో నూజెండ్లమండలంలోని టీడీపీ కంచుకోటగా ఉండే గురప్పనయుడిపాలెం, టిఅన్నారం, గణేషునిపాలెంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలల్లో సైతం తమ పార్టీలో వందల మంది టీడీపీ కార్యకర్తలు చేరడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలను ఆకర్షిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసి మరలా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు తమ కుటుంబ సభ్యులుగా భావించి అన్నీ విధాల ప్రాధాన్య తనిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మీ రాజా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధరకే కందులు కొనుగోలు

రొంపిచర్ల: రైతులు పండించిన కంది పంటను మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఏడీఏ పి. మస్తానమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని రొంపిచర్లలో సాగుచేస్తున్న కంది పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వారు సూచించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న కందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా కొనుగోలు చేస్తారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా కందుల ధర రూ.9370లు గా ఉందని ఆమె తెలిపారు. ఒక క్వింటాకు ఖర్చు అయ్యే గోనె సంచులు, లేబర్ ఛార్జీలు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతే ఆ ఖర్చును భరిస్తే క్వింటాకు రూ.74.65 పైసలు చొప్పన అదనంగా రైతు బ్యాంకు ఎకౌంట్‌లో జమ చేస్తుందున్నారు.